సాక్షి తిరుపతి

బుధవారం। 1। మార్చి। 2023



తిరుపతి బులియన్

బంగారం :

24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.57,310
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.5,119

వెండి:

హోల్‌సేల్ ధర (కిలో)	రూ.64,900
రిటైల్ వెండి గ్రాము	రూ.66.90

	గరిష్టం	కనిష్టం
తిరుపతి	34	18
చిత్తూరు	34	18
తిరుమల	29	13
గూడూరు	34	20
నగరి	35	19



తెప్పోత్సవాల ట్రయల్‌రన్

తిరుమలలో ఈనెల 3 నుంచి 7వ తేదీ వరకు సాలకట్ల తెప్పోత్సవాలు జరగనున్న నేపథ్యంలో మంగళవారం సాయంత్రం పుష్కరిణిలో తెప్పల ట్రయల్ రన్ నిర్వహించారు. – తిరుమల

న్యూస్‌రీల్

లోకేష్ ప్రమాణం చేస్తావా?



మాట్లాడుతున్న టీటీడీ బోర్డు సభ్యుడు పోకల అశోక్‌కుమార్

తిరుపతి కల్చరల్: ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మోహన్‌రెడ్డి టీటీడీ బోర్డు సభ్యులను అమ్ముకున్నాడని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా లోకేష్ ఆరోపించడం నీతిమాలిన చర్య అని టీటీడీ బోర్డు సభ్యుడు పోకల అశోక్‌కుమార్ ధ్వజమెత్తారు. టీటీడీ బోర్డు సభ్యుల జాబితా జీఓలో మొదటి వ్యక్తిని తానేనని, ఒక్క పైసా ఇవ్వలేదని స్పష్టం చేశారు. ‘నీ ఆరోపణలు వాస్తం అని చెప్పే దమ్ముంటే తిరుమల శ్రీవారి సన్నిధి ఎదుట ప్రమాణానికి ఎప్పుడొస్తావో తేదీ ప్రకటిస్తే అందుకు నేనే సిద్ధమే’నని సవాల్ విసిరారు. పదవులు అమ్ముకొని కోట్లు దోచుకున్న చరిత్ర టీడీపీదన్నారు. పాదయాత్ర చేస్తూ ప్రజలకు ఏమి చేస్తావో చెప్పుకోవడం విస్మరించి జనరంజకంగా సాగుతున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనపై విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ యువజన విభాగం నేత బండ్ల లక్ష్మీపతి, నాయకులు మంగళంపేట సురేష్ బాబు, హరిచౌహాన్ నాయక్, వెంకటేష్, చంద్రశేఖర్, ఖాసీం, భాస్కర్ పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల ఏర్పాట్ల పరిశీలన



ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటరమణారెడ్డి

శ్రీకాళహస్తి: పట్టణంలోని స్కిట్ ఇంజినీరింగ్ కళాశాలలో ఎమ్మెల్సీ ఎన్నికల ఏర్పాట్లలో భాగంగా స్ట్రాంగ్ రూమ్, బ్యాలెట్ బాక్సులను మంగళవారం కలెక్టర్ వెంకటరమణారెడ్డి పరిశీలించారు. శ్రీకాళహస్తి డివిజన్‌లో 17 పట్టభద్రుల పోలింగ కేంద్రాలకు 51 బ్యాలెట్ బాక్సులు, 8 ఉపాధ్యాయ పోలింగ్ స్టేషన్లకు 16 బ్యాలెట్ బాక్సులు, రిజర్వులో మరో 40 బాక్సులు అందుబాటులో ఉన్నట్లు సిబ్బంది తెలిపారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికల డిస్ట్రిబ్యూషన్ రిసెప్షన్ సెంటర్లు, స్ట్రాంగ్‌రూమ్ ఏర్పాట్లు నిబంధనల మేరకు ఉండాలన్నారు. సమస్యాత్మక, అతి సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు శ్రీకాళహస్తి డివిజన్‌లో 10 వరకు ఉన్నాయన్నారు. ఆయన వెంట తహసీల్దారు, ఏఈఆర్‌ఓ జరీనా, పురపాలక సంఘ కమిషనర్ బాలాజీనాయక్, ఎంపీడీఓ ప్రేమ్‌రాజ్‌కుమార్, మండల సర్వే అధికారి, స్కిట్ కళాశాల సిబ్బంది ఉన్నారు.



టీడీపీ జాతీయ కార్యదర్శి నారా లోకేష్ పాదయాత్ర ఆ పార్టీ నేతల్లో గందరగోళం సృష్టిస్తోంది. ఆయన పర్యటించే ప్రతి నియోజకవర్గంలోనూ లెక్కలేసి.. అభ్యర్థులను ప్రకటిస్తూ వస్తుండగా.. కొన్ని నియోజకవర్గాలను మాత్రమే పక్కనపెట్టడంపై ఆ పార్టీ క్యాడర్ రగిలిపోతోంది. కొన్ని నియోజకవర్గాల్లో అభ్యర్థులు లేకపోగా.. మిగిలిన నియోజకవర్గాల పరిస్థితి ఏంటని ప్రశ్నిస్తోంది. జనసేన, టీడీపీ పొత్తులో భాగంగా ఆయా నియోజకవర్గాలను పెండింగ్‌లో పెడుతున్నారన్న చర్చ జోరుగా సాగుతోంది. ముఖ్యంగా తిరుపతి విషయంలో ఇది స్పష్టంగా కనిపిస్తోంది. స్థానిక మాజీ ఎమ్మెల్యే, తుడా మాజీ చైర్మన్ పేర్లు ప్రకటిస్తారని ఆశించినా లోకేష్ వారి ప్రస్తావన తీసుకురాకపోవడం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది.

లెక్క తేల్చని గళం

- అగ్గిరాజేస్తున్న లోకేష్ యువగళం పాదయాత్ర
- అభ్యర్థుల ప్రకటన విషయంలో అయోమయం
- టీడీపీ, జనసేన మధ్య ఎటూ తేల్చని అధిష్టానం
- కొన్ని నియోజకవర్గాలను పెండిగ్‌లో పెట్టడంపై అంతర్మథనం
- తిరుపతిలో సుగుణమ్మను పక్కనపెడతారా..? అంటూ నేతల ఆగ్రహం

సాక్షి, తిరుపతి: ఉమ్మడి చిత్తూరు జిల్లాలో నెల రోజులుగా సాగుతున్న లోకేష్ పాదయాత్ర టీడీపీ శ్రేణులకు తలనొప్పిగా మారింది. ఎప్పుడు ఏమి మాట్లాడుతారో.. ఎటువంటి నిర్ణయాలు తీసుకుంటారోనని ఆ పార్టీ నేతల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. కుప్పం, పలమనేరు, పూతలపట్టు, చిత్తూరు, గంగాధరనెల్లూరు, నగరి, సత్యవేడు, శ్రీకాళహస్తి, తిరుపతి పూర్తి చేసుకుని ప్రస్తుతం చంద్రగిరి నియోజకవర్గంలో పాదయాత్ర సాగుతోంది. పాదయాత్ర సందర్భంగా ప్రతి నియోజకవర్గంలోనూ నారా లోకేష్ అభ్యర్థులను ప్రకటించడం జరుగుతోంది. అయితే పూతలపట్టు, చిత్తూరు, గంగాధరనెల్లూరు, తిరుపతి అసెంబ్లీ స్థానాలకు అభ్యర్థులను ప్రకటించకపోవడం వెనుక ఆంతర్యమేమిటని ఆ పార్టీ నేతల్లో చర్చసాగుతోంది. పూతలపట్టు, చిత్తూరు, జీడీనెల్లూరు నియోజకవర్గాల్లో టీడీపీ అభ్యర్థుల కొరత ఉండడంతో పక్కనపెట్టిన లోకేష్.. తిరుపతి అసెంబ్లీ స్థానాన్ని తిరకాసు పెట్టేవిధంగా ఇరుకున పెట్టారన్న భావం ఆ పార్టీ నేతల్లో వ్యక్తమవుతోంది. స్థానిక మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, తుడా మాజీ చైర్మన్ నరసింహయాదవ్, జేబీ శ్రీనివాస్ పేర్లు ప్రకటిస్తారని ఆశించిన నేతలకు నిరాశే ఎదురైంది. కష్టకాలంలో పార్టీ మోస్తున్న తమ అభిమాన నేతలను పక్కనపెడతారేమోనని ఆ పార్టీ క్యాడర్ రగిలిపోతోంది.

క్యాడర్ లేదన్నా.. టీడీపీ చాప్టర్ క్లోజన్నా..!

టీడీపీ, జనసేన పొత్తులో భాగంగా పవన్‌కళ్యాణ్ తిరుపతి నుంచి పోటీలో నిలబెట్టేందుకు చంద్రబాబు, లోకేష్ దాదాపు నిర్ణయం తీసుకున్నట్లు ప్రచారం జరుగుతోంది. అందుకే తిరుపతికి అభ్యర్థిని ప్రకటించలేదని టీడీపీ ముఖ్యనేతలు చెబుతున్నారు. పవన్‌కి తిరుపతి సీటు ఇస్తే.. టీడీపీ చాప్టర్ క్లోజ్ అని స్థానిక నేతలంతా మూకుమ్మడిగా అటు చంద్రబాబుకి, ఇటు లోకేష్‌కి తేల్చిచెప్పారు. రెండు రోజుల క్రితం కూడా ఇదే విషయాన్ని లోకేష్‌కు వివరించినట్లు తెలిసింది. తిరుపతిలో జనసేనకు కేడర్ లేదని స్పష్టం చేసినట్లు సమాచారం. దీంతో లోకేష్ పొమ్మలేక పొగబెట్టే చందంగా తిరుపతి నియోజకవర్గనేతల సమావేశంలో సుగుణమ్మతో పాటు ఆమె అనుచరులకు క్లాస్ తీసుకున్నారు. కార్పొరేషన్ ఎన్నికలతో పాటు టౌన్ బ్యాంక్ ఎన్నికల్లో టీడీపీ కనీసం పోటీ ఇవ్వకపోవడం ఏంటని మండిపడ్డారు. తన తండ్రి చంద్రబాబులా మెతక వైఖరితో వ్యవహరించనని, ఎంతటి వారినైనా పక్కన పెడతానని సుగుణమ్మకు వార్నింగ్ ఇచ్చినట్లు చర్చించుకుంటున్నారు. అదేవిధంగా చంద్రబాబు ప్రాతినిథ్యం వహిస్తున్న కుప్పం నేతలతో ఇలాగే వ్యవహరించారు. ఏం పీకారని ప్రశ్నల వర్షం కురిపించారు.

జూనియర్ ఎన్టీఆర్ ఫ్యాన్స్ ఫైర్

యువగళం పాదయాత్రలో భాగంగా తిరుపతిలో ‘హలో లోకేష్’ పేరుతో ముఖాముఖి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థి అడిగిన ప్రశ్నకు లోకేష్ ఇచ్చిన సమాధానంపై జూనియర్ ఎన్టీఆర్ అభిమానులు మండిపడుతున్నారు. ‘జూనియర్ ఎన్టీఆర్, పవన్ కళ్యాణ్ రాజకీయాల్లోకి వస్తే మీరు ఆహ్వానిస్తారా?’ అని విద్యార్థి అడిగిన ప్రశ్నకు లోకేష్ స్పందిస్తూ... పవన్ కళ్యాణ్‌ను గురించి మాత్రం ప్రస్తావించి, జూ.ఎన్టీఆర్‌ను విస్మరించడంపై ఆయన అభిమానులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జూనియర్ ఎన్టీఆర్ రాజకీయాల్లోకి వస్తే తన వారసత్వానికి ప్రమాదం ఉంటుందనే అక్కసుతో ఆయన్ని పక్కనపెట్టే ప్రయత్నం చేస్తున్నారని మండిపడుతున్నారు.

రైతుకు భరోసా!



మెగా చెక్కును రైతులకు అందజేస్తున్న వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులు

- జిల్లాలో 1,75,145 మంది రైతులకు రైతు భరోసా
- రూ.523.84 కోట్లు అన్నదాతల ఖాతాల్లో జమ
- కలెక్టరేట్‌లో వైఎస్సార్ రైతు భరోసా, ఇన్‌పుట్ సబ్సిడీ కార్యక్రమం

తిరుపతి అర్బన్: రాష్ట్ర ప్రభుత్వం రైతుకు వెన్నుదన్నుగా నిలుస్తోంది. ఏటా పెట్టుబడి సాయంతోపాటు ప్రకృతి వైపరీత్యాల నుంచి ఆదుకునేందుకు వినూత్నంగా పథకాలు అమలుచేస్తోంది. ఇందులో భాగంగా మంగళవారం వైఎస్సార్ రైతు భరోసా–పీఎం కిసాన్ పథకంతోపాటు మాండూస్ తుపాన్‌తో నష్టపోయిన రైతులకు నగదు బదిలీ కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గుంటూరు జిల్లా, తెనాలి నుంచి ప్రారంభించగా.. అదే సమయంలో కలెక్టరేట్‌లో జరిగిన కార్యక్రమంలో పలువురు జిల్లా అధికారులు, రైతులు పాల్గొని కార్యక్రమాన్ని వీక్షించారు. అనంతరం డీఏఓ(జిల్లా వ్యవసాయాధికారి)ప్రసాద్‌రావు మాట్లాడుతూ జిల్లాలో 2019 నుంచి ఇప్పటి వరకు జిల్లాలో వైఎస్సార్ రైతు భరోసా పథకం కింద 1,75,145 మంది రైతులకు ఏటా రూ.13,500 చొప్పున రూ.523.84 కోట్లు జమచేసినట్టు తెలిపారు. తాజాగా మంగళవారం ఈ పథకం ద్వారా రూ.36.87 కోట్లు జమచేశామన్నారు. అలాగే మాండూస్ తుపాన్‌తో నష్టపోయిన 1,364 మంది రైతులకు రూ.90.82 లక్షల ఇన్‌పుట్ సబ్సిడీ జమచేసినట్టు పేర్కొన్నారు. అలాగే 2023ను ఐక్యరాజ్య సమితి అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరంగా ప్రకటించిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. ఉద్యానశాఖ జిల్లా అధికారి దశరథరామిరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం కలెక్షన్ సెంటర్లు, కోల్డ్‌స్టోరేజీలకు 75శాతం రాయితీలు కల్పించిందన్నారు. మత్స్యశాఖ జిల్లా అధికారి చాంద్‌బాషా మాట్లాడుతూ ఫిష్ ఆంధ్ర ద్వారా తాజా చేపలను అందించడానికి 20 రకాల వాహనాలతోపాటు, చేపల వ్యాపార దుకాణాల ఏర్పాటుకు రూ.2 లక్షల నుంచి రూ.50 లక్షల మేరకు బ్యాంక్ రుణాలు ఇస్తున్నట్టు తెలిపారు. ఇందులో 50శాతం రాయితీ ఉందన్నారు. అనంతరం ఇన్‌పుట్ సబ్సిడీ మెగా చెక్కును అధికారులు రైతులకు అందజేశారు. వ్యవసాయశాఖ జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ భాస్కరయ్య, డీఆర్‌సీ డీఈఏ రత్నప్రసాద్, వ్యవసాయశాఖ ఏడీలు రమేష్‌రెడ్డి, మనోహర్, సుబ్రమణ్యం, కలెక్టరేట్ పరిధిలోని ఏఓలు గాయత్రి, సరళ, హరిత, ఉద్యానశాఖ అధికారులు సునీల్, పుష్పలత తదితరులు పాల్గొన్నారు.

22ఏని తీసుకొచ్చింది చంద్రబాబు



చంద్రబాబు దిష్టిబొమ్మను దహనం చేస్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు

తిరుపతి మంగళం : నిషేధిత భూముల్లో రిజిస్ట్రేషన్లు రద్దు చేసేందుకు 22ఏ(1)(సి) సెక్షన్‌ను తీసుకొచ్చింది నారా చంద్రబాబునాయుడేనని కార్పొరేషన్ స్టాండింగ్ కమిటీ సభ్యులు ఎస్‌కె. బాబు, కార్పొరేటర్లు రామస్వామి వెంకటేశ్వర్లు, జిల్లా యూత్ వింగ్ అధ్యక్షుడు అజయ్ కుమార్ తెలిపారు. తిరుపతిలో 22ఏ(1)(సి) సెక్షన్‌ను తీసుకొచ్చి భూముల రిజిస్ట్రేషన్లు నిలుపుదల చేశారంటూ ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డిపై టీడీపీ చేస్తున్న దుష్ప్రచారాన్ని వారు తిప్పికొట్టారు. మంగళవారం తిరుపతి తుడా సర్కిల్ లో నిరసన కార్యక్రమాలకు దిగారు. టీడీపీ విషప్రచారం చేస్తోందని, జీఓకు, సెక్షన్‌కు తేడా తెలియని పప్పు నారా లోకేష్ అంటూ నినాదాలు చేశారు. అనంతరం చంద్రబాబు దిష్టిబొమ్మను దహనం చేశారు. అఫ్ నాలెడ్జ్ కలిగిన నారా లోకేష్‌ను పాదయాత్ర పేరుతో ప్రజల్లోకి పంపి ప్రజల్లో గందరగోళం సృష్టిస్తున్నారని మండిపడ్డారు. 2018 టీడీపీ హయాంలో 22ఏ (1)(సి) సెక్షన్ తీసుకొచ్చి భూముల రిజిస్ట్రేష న్లు కాకుండా చేసింది చంద్రబాబేనని గుర్తుచేశారు. అయితే తిరుపతి శివజ్యోతినగర్‌లోని 695 నుంచి 701 వరకు ఉన్న సర్వే నంబర్లలో అప్పుడు చంద్రబాబు నిషేధించిన 16 ఎకరాల్లో రిజిస్ట్రేషన్లు జరిగేలా చేసిన ఘనత తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డికే దక్కుతుందన్నారు. అలాంటి నాయకుడిపై టీడీపీ అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు దొడ్డారెడ్డి సిద్దారెడ్డి, కార్పొరేటర్లు, జేసీఎస్ అధ్యక్షులు, డివిజన్ల అధ్యక్షులు, టౌన్‌బ్యాంక్ డైరెక్టర్లు, జిల్లా ఎస్సీ సెల్ కన్వీనర్లు, గ్రీవెన్స్‌సెల్ కన్వీనర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ప్లకార్డులు పట్టుకుని నిరసన వ్యక్తం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు

ఆ భూముల రిజిస్ట్రేషన్ బ్యాన్‌కు బ్రేక్

- ఎమ్మెల్యే భూమన చొరవతో వాయిదా
- టీటీడీకి చెందిన 2,600 ఎకరాల వివరాల సేకరించమని ఆదేశాలు
- ప్రతిపక్ష పార్టీల అసత్య ప్రచారాలను ఖండించిన వైఎస్సార్‌సీపీ

సాక్షి, తిరుపతి: ఆస్తుల రిజిస్ట్రేషన్ ప్రక్రియ నిలిపివేయాలన్న నిర్ణయంపై టీటీడీ వెనక్కి తగ్గింది. భూముల పరిరక్షణలో భాగంగా ఇదివరకు 22ఏ(1)(సి)సెక్షన్ మేరకు రిజిస్ట్రేషన్లు నిలిపేయాలని దేవదాయశాఖ కమిషనర్‌ని కోరిన విషయం తెల్సిందే. అందులో భాగంగా ఏపీలో టీటీడీ ఆస్తుల రిజిస్ట్రేషన్ నిలిపేయాలంటూ దేవదాయశాఖ కమిషనర్ రిజిస్ట్రేషన్ శాఖకు ఉత్తర్వులిచ్చింది. అయితే సర్వే నంబర్లలో స్పష్టత లేకపోవడంతో ప్రైవేటు వ్యక్తులకు సంబంధించిన ఆస్తుల రిజిస్ట్రేషన్ ప్రకీయ కూడా నిలిచిపోయింది. ప్రధానంగా తిరుపతి పట్టణంలో ఈ సమస్య తలెత్తింది. తిరుపతి పరిసర ప్రాంతాల్లో టీటీడీకి చెందిన 2,600 ఎకరాలకు సంబంధించి రిజిస్ట్రేషన్ ఆగిపోవడంతో స్థానికులు ఎమెల్యే కరుణాకరరెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన ఈ సమస్యపై ముఖ్యమంత్రి కార్యాలయ అధికారులతో మాట్లాడడంతో పాటు టీటీడీ అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. టీటీడీ ప్రకటించిన షెడ్యూల్లో ఉన్న తప్పిదాలు సరిదిద్దాలని సూచించారు. దీంతో ప్రకటించిన షెడ్యూల్లో తప్పిదాలు ఉన్నట్లు గుర్తించిన టీటీడీ అధికారులు ప్రస్తుతానికి రిజిస్ట్రేషన్లు బ్యాన్ నిర్ణయాని వాయిదా వెయ్యాలని, త్వరలోనే పూర్తిస్థాయిలో సరిదిద్దిన షెడ్యూల్‌ని ప్రకటిస్తామమని దేవదాయశాఖ కమిషనర్‌కి జేఈఓ వీరబ్రహ్మం లేఖరాశారు. ఈ లేఖ ఆధారంగా దేవదాయశాఖ కమిషనర్ తదుపరి ఉత్తర్వులు జారీ చేస్తామని సమాధానం ఇచ్చినట్లు తెలిసింది.

ఈ సమస్య పరిష్కార బాధ్యత నాది



తిరుపతిలో టీటీడీ భూముల రిజిస్ట్రేషన్‌కు సంబంధించిన గందరగోళం ఏర్పడింది. ఒక బాధ్యత గల శాసనసభ్యుడిగా నేను సంబంధిత అధికారులతో మాట్లాడాను. వెంటనే ఈ సమస్య సరిదిద్దమని కోరాను. ఈ మేరకు టీటీడీ చేత ఎండోమెంట్ కమిషనర్‌కు ఓ లేఖ కూడా రాయించాను. ఈ సమస్యకు సంబంధించి పరిష్కారం వేగవంతంగా జరుగుతోంది. భూముల రిజిస్ట్రేషన్లకు ఎటువంటి ఇబ్బందీలేకుండా చేసే బాధ్యత నాది.

– భూమన కరుణాకరరెడ్డి, ఎమ్మెల్యే, తిరుపతి

లోకేష్ గాలి సోకిందా

టీడీపీ నేతలందరికీ లోకేష్ గాలి సోకినట్టుంది. 30 ఏళ్ల రాజకీయ అనుభవం ఉన్న టీడీపీ నేతలకు జీఓకు సెక్షన్‌కు తేడా తెలియకుండా ధర్నా చేసి అభాసుపాలయ్యారు. తిరుపతి పరిధిలోని టీటీడీ భూములను నిషేధిత జాబితా 22ఏ(1)(సి)సెక్షన్‌లో చేర్చారు. ఈ విషయంపై తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి గత నెల 24న స్థానికులకు ఇబ్బంది లేకుండా ముఖ్యమంత్రి కార్యాలయ అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకున్నారు. అయిపోయిన పెళ్లికి బాజాలు అంటూ సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉందని చెప్పుకుంటున్న టీడీపీ ముఖ్య నేతలు రెండు రోజులుగా అసత్య ప్రచారాలు చేస్తున్నారు. అందులో భాగంగా మంగళవారం తిరుపతి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగారు. ఈ ఆందోళనలో నిషేధిత జాబితా సెక్షన్ 22ఏ అనాల్సింది పోయి జీఓ నం.22ఏ అని మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, తుడా మాజీ చైర్మన్ నరసింహయాదవ్, కార్పొరేటర్ ఆర్‌సీ మునికృష్ణ, సీనియర్ నాయకులంతా పదే పదే నినాదాలు చేయడం అక్కడి వారిని ఆశ్చర్యానికి గురిచేసింది.

కార్గో సేవలు విస్తృతం

తిరుపతి అర్బన్: ఆర్టీసీ కార్గో సేవలు విస్తృతం చేస్తున్నట్లు కార్గో రీజనల్ మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ ఏకాంబరం మంగళవారం తెలిపారు. బల్క్‌గా బుకింగ్ చేసిన సరుకులను రవాణా చేయడానికి కొత్తగా డీజీటీ (డిపో గూడ్స్ ట్రాన్స్‌పోర్ట్) కంటైనర్లను సిద్ధం చేశామని వెల్లడించారు. గతంలో టన్ను వరకు రవాణా చేసేవారని, తాజాగా పది టన్నులను రవాణాచేయడానికి ప్రణాళికలు సిద్ధం చేశారు. ఇందులో 200 కిలోమీటర్లకు ఒక్కో కిలోమీటరుకు రూ.50చొప్పున వసూలు చేయనున్నట్లు వెల్లడించారు. అలాగే 201 నుంచి 300 రూ.49, 301 నుంచి 400 రూ.48, 401 నుంచి 500 రూ.47, 501 నుంచి 600 రూ.46, 601 నుంచి 700 రూ.45, 701 నుంచి 800 రూ.44, 801 నుంచి 900 రూ.43, 901 నుంచి 1000 రూ.42, 1001 నుంచి 1100 రూ.41, 1101 నుంచి 1200 రూ.40 నిర్ణయించినట్లు ఆయన పేర్కొన్నారు.

పకడ్బందీగా పెద్దల పోలింగ్

- ఎమ్మెల్సీ ఎన్నికల ఏర్పాట్లపై సమీక్ష
- ప్రణాళికాబద్ధంగా నిర్వహించాలని ఆర్‌ఓ ఆదేశం


మాట్లాడుతున్న ఆర్‌ఓ హరినారాయణన్, జేసీ వెంకటేశ్వర్

సాక్షి, చిత్తూరు : ఉమ్మడి చిత్తూరు–నెల్లూరు–ప్రకాశం జిల్లాల పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించేందుకు ప్రణాళికాబద్ధంగా ఏర్పాట్లు చేయాలని రిటర్నింగ్ అధికారి హరినారాయణన్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ నుంచి ఆయా జిల్లాల ఏఆర్‌ఓలతో వీడియోకాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. మార్చి 13వ తేదీన జరుగనున్న ఎన్నికల్లో ఎటువంటి తప్పులకు తావు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అవసరమైతే సెక్టోరల్ , ప్రిసైడింగ్ అధికారులతోపాటు ఎన్నికల సిబ్బందికి పోలింగ్, కౌంటింగ్‌పై ప్రత్యేక శిక్షణ ఇప్పించాలని సూచించారు. పోలింగ్ కేంద్రాల్లో పక్కాగా మౌలికవసతులు కల్పించాలని, ఆర్డీఓలు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని స్పష్టం చేశారు. ఆయా కేంద్రాలకు కేటాయించిన నంబర్‌ను పెయింట్‌తో వేయించాలన్నారు. 9వ తేదీ నాటికి పోలింగ్ సామగ్రిని పూర్తిస్థాయిలో సిద్ధం చేసుకోవాలని కోరారు. బ్యాలెట్ బాక్సుల నాణ్యతను తనిఖీ చేసుకోవాలని చెప్పారు. స్ట్రాంగ్‌రూమ్‌ల వద్ద పటిష్టంగా బందోబస్తు ఏర్పాటు చేయించాలని ఆదేశించారు. బీఎల్‌ఓల ద్వారా ఓటర్లకు స్లిప్‌లు అందజేయాలని తెలిపారు. ఆర్‌డీఓలు తమ పరిధిలోని డీఎస్పీలు, తహసీల్దార్లతో సమావేశమై ఏర్పాట్లను సమీక్షించాలన్నారు. పోస్టర్ బ్యాలెట్ ఫెసిలిటేషన్ సెంట, హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేయాలని సూచించారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఓటు హక్కు వినియోగించుకోవడంపై పోస్టర్లతో అవగాహన కల్పించాలని స్పష్టం చేశారు. కాన్ఫరెన్స్‌లో జేసీ వెంకటేశ్వర్, డీఆర్‌ఓ రాజశేఖర్ పాల్గొన్నారు.

జగనన్న కాలనీల్లో నిరంతర విద్యుత్

- ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయండి
- కమిషనర్ అనుపమ అంజలి


ఇళ్ల నిర్మాణాలపై సూచనలు చేస్తున్న కమిషనర్ అనుపమ అంజలి

తిరుపతి తుడా : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న జగనన్న కాలనీల్లో నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా చర్యలు చేపట్టాలని తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అనుపమ అంజలి అధికారులను ఆదేశించారు. చంద్రగిరి మండల పరిధిలోని కొత్తపల్లి జగనన్న లేఔట్‌ను మంగళవారం అధికారులతో కలసి ఆమె పరిశీలించారు. ఈసందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. అలానే నీటి సరఫరాకు అవసరమైన చర్యలు చేపట్టనున్నట్లు ఆమె వెల్లడించారు. ఇళ్ల నిర్మాణాలకు నీటి కొరత ఉంటే అవసరమైన పవర్ బోర్లు వేయించనున్నట్లు చెప్పారు. మొదటి దశ గృహ నిర్మాణాలను యుద్ధప్రాతిపదికన తుది మెరుగులు దిద్ది పూర్తి చేయించనున్నట్లు తెలిపారు. ఇళ్ల నిర్మాణాల్లో లబ్ధిదారులు సైతం భాగస్వామ్యులవ్వాలని పిలుపునిచ్చారు. ఇంజినీర్లు, హౌసింగ్ అధికారులు సమన్వయంతో ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయించాలన్నారు. డీఈఈ విజయకుమార్ రెడ్డి, సంజీవ్ కుమార్, హౌసింగ్ పీడీ శ్రీనివాసరావు, డీఈ మోహన్‌రావు పాల్గొన్నారు.

అట్టడుగు వర్గాల
ఆశాజ్యోతి జగన్


చిత్తూరులో ఎమ్మెల్సీగా ధ్రువీకరణ పత్రాన్ని అందుకుంటున్న సిపాయి సుబ్రమణ్యం


నెల్లూరులో ఎమ్మెల్సీగా ధ్రువీకరణ పత్రాన్ని అందుకుంటున్న మేరిగ మురళీధర్

సాక్షి, తిరుపతి /గూడూరు: బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని ఎమ్మెల్సీలు డాక్టర్ సిపాయి సుబ్రహ్మణ్యం, మేరిగ మురళీధర్ కొనియాడారు. బీసీలు, ఎస్సీలకు రాజ్యాధికారం కల్పించిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. స్థానిక సంస్థల ఎమ్మెల్సీలుగా ఏకగ్రీవంగా గెలుపొందిన వారు వేర్వేరుగా మీడియాతో మాట్లాడారు. వారి మాటల్లోనే

బీసీలకు బిగ్ బ్రదర్ జగన్

బీసీలకు బిగ్ బ్రదర్, బీసీల పాలిట దైవం, గాడ్ ఫాదర్ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి. స్వాతంత్య్రం వచ్చినప్పటి నుంచి జనాభా ప్రాతిపదికన బీసీలకు 50శాతం రాజకీయ పదవులు ఇవ్వాలని డిమాండ్ చేస్తూనే ఉన్నాం. గొంతులు బొంగురు పోయాయి. అసహనం పెరిగింది. బీసీలకు రాజకీయ రుచి చూపించింది ఒకరు ఎన్టీఆర్ అయితే.. నేటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అంతకు మించి పదవులు కట్టబెట్టారు. చిత్తశుద్ధితో 64శాతం ఎమ్మెల్సీ పదవులు ఇచ్చారు. పింఛన్ల అర్హత వయసు తగ్గించి లక్షలాది మంది బీసీలకు ఆర్థిక స్వేచ్ఛ కల్పించారు. అభినవ పూలేగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బీసీల గుండెల్లో స్థానం సంపాదించుకున్నారు. చంద్రబాబు బీసీలను భ్రమలో ఉంచారే తప్ప చేసిందేమీ లేదు.

\- ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం

అభినవ అంబేడ్కర్ జగనన్న

రాజ్యాంగ నిర్మాత బాబా సాహేబ్ అంబేడ్కర్ అయితే.. అభినవ అంబేడ్కర్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను, ఎన్నికలయ్యాక ఏ రాజకీయ పార్టీగానీ, ఏ రాజకీయ నాయకుడు గానీ గుర్తుంచుకున్న దాఖలాలు లేవు. కానీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎం అయ్యాక, ఆయన ఇచ్చిన హామీలతోపాటు, స్థానిక ఎమ్మెల్యేలు ఇచ్చిన హామీలను కూడా పరిగణనలోకి తీసుకున్న ఏకైక నాయకుడు జగనన్న. మ్యానిఫెస్టోను ఒక భగవద్గీతగా, బైబిల్, ఖురాన్‌లా తలచి, వాటన్నింటినీ అమలుచేసిన ఘనత కూడా ఆయనకే దక్కుతుంది. చంద్రబాబు దళితులుగా పుట్టాలని ఎవరైనా కోరుకుంటారా.. అని దళిత జాతిని కించపరచేలా మాట్లాడారు. కానీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దళితులను బంధువులుగా చెప్పిన మహోన్నత విలువలున్న వ్యక్తి.

\- ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్

యువత దేశానికి వెన్నెముక

- ఏక్ భారత్ శ్రేష్ట్ భారత్ ఒక బృహత్తర కార్యక్రమం
- భిన్నత్వంలో ఏకత్వం మన దేశ ప్రత్యేకత
- ఆంధ్రప్రదేశ్ విభిన్న భాషల సంస్కృతి సంప్రదాయాల సమ్మేళనం
- తిరుపతి కలెక్టర్ వెంకటరమణారెడ్డి



అరుణాచల్‌ప్రదేశ్ విద్యార్థుల బృందం, అధ్యాపకులతో కలెక్టర్ వెంకటరమణారెడ్డి

ఏర్పేడు: భిన్నత్వంలో ఏకత్వం మన దేశ ప్రత్యేకత అని, ఆంధ్రప్రదేశ్ మాండలిక భాషల సంస్కృతి, సంప్రదాయాల సమ్మేళనమని కలెక్టర్ వెంకటరమణారెడ్డి తెలిపారు. రాష్ట్ర సంస్కృతి, సంప్రదాయాలు అందరూ తెలుసుకునే విధంగా యువసంగం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఏక్ భారత్ శ్రేష్ట్ భారత్ కార్యక్రమం ఎంతగానో తోడ్పడుతుందని చెప్పారు. మంగళవారం ఐఐటీ తిరుపతి క్యాంపస్‌లో జరిగిన ఏక్ భారత్ శ్రేష్ట్ భారత్‌లో భాగంగా అరుణాచల్ ప్రదేశ్ నుంచి ఐఐటీ తిరుపతికి చేరుకున్న 28 మంది విద్యార్థుల బృందం వారి అధ్యాపకులతో ముఖాముఖి కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని మాట్లాడారు. ఈ యాత్రలో భాగంగా దేశంలోని విభిన్న ప్రాంతాల సంస్కృతులు, సంప్రదాయాలు, ఆహారపు అలవాట్లు తదితర అంశాలపై అన్ని ప్రాంతాల వారికి తెలియజేయాలని సూచించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తెలుగు భాషలో విభిన్న మాండలిక భాషలతో రాయలసీమ, కోస్తా, ఉత్తర కోస్తా జిల్లాల సమూహాన్నారు. సుస్థిర అభివృద్ధి అనేది పర్యావరణ హితంగా ఉండాలన్నారు. ఐఐటీ తిరుపతి డైరెక్టర్ కేఎన్ సత్యనారాయణ మాట్లాడుతూ భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటులో 1953లో ఆంధ్రప్రదేశ్ ఏర్పడినట్లు వివరించారు. తిరుపతి ప్రాంత ప్రత్యేకతలు, చరిత్ర, సంప్రదాయాలను తెలుసుకునేలా ఈ కార్యక్రమం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. అరుణాచల్‌ప్రదేశ్ నుంచి వచ్చిన విద్యార్థుల బృందం అధ్యాపకులు వారి అనుభవాలను ముఖాముఖిలో పంచుకున్నారు. అనంతరం వెంకటేశ్వర స్వామి ప్రతిమను బహూకరించారు. కార్యక్రమంలో ఐఐటీ తిరుపతి అధ్యాపకులు, యువసంగం ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎస్వీసీఈలో జాతీయ సైన్స్ దినోత్సవం


జాతీయ సైన్సు దినోత్సవంలో ఎస్వీసీ ఇంజినీరింగ్ కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు

తిరుపతి ఎడ్యుకేషన్: తిరుపతి–కరకంబాడి రోడ్డులోని ఎస్వీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ (ఎస్వీసీఈ)లో మంగళవారం జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ''గ్లోబల్ సైన్స్ ఫర్ గ్లోబల్ వెల్‌బీయింగ్'' అనే అంశంపై వ్యాస రచన, వక్తృత్వ, క్విజ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్.సుధాకర్‌రెడ్డి, ఎస్ఎస్ఎస్ అధికారులు డాక్టర్ టి.చంద్రయ్య, డాక్టర్ కె.సుజన్‌కుమార్, డాక్టర్ పి.బాబు, డాక్టర్ కె.రోజా, డాక్టర్ కె.రెడ్డి మోహన్, అధ్యాకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పోగొట్టుకున్న డబ్బు తిరిగి అప్పగింత


నూతన బారికేడ్స్‌ను పరిశీలిస్తున్న ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి

తిరుపతి క్రైమ్: సైబర్ క్రైమ్‌లో మోసపోయిన బాధితునికి తిరిగి డబ్బు అప్పగించిన సంఘట న మంగళవారం చోటుచేసుకుంది. ఈ మేరకు ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి ఒక ప్రకటన విడుదల చేశారు. ఈనెల 20న కాంచన అనే వ్యక్తి ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పిన గుర్తుతెలియని వ్యక్తిని నమ్మాడు. ఆపై ఫార్మాలిటీస్ కోసం రూ.70 వేలను సైబర్ నేరగాళ్లను నమ్మి కట్టాడు. అనంతరం ఆ వ్యక్తి ఫోన్ స్విచ్ ఆఫ్ కావడంతో మోసపోయానని తెలుసుకొని పోలీసులను సంప్రదించాడు. దీనిని సవాల్‌గా తీసుకున్న క్రైమ్ పోలీసులు అనుమానత వ్యక్తి అకౌంట్‌ను హోల్డ్ చేశారు. పోగొట్టుకున్న రూ.70 వేలు తిరిగి బాధితుడి అకౌంట్లో జమయ్యేలా సాంకేతిక పరిజ్ఞానంతో కృషిచేసి సఫలమయ్యారు.

బారికేడ్స్ విరాళం

సామాజిక బాధ్యతలో భాగంగా పలు వ్యాపార సంస్థల వారు పోలీసులకు ఉపయోగపడేలా 75 బారికేడ్స్, స్టాప్ బోర్డులను ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డికి అందజేశారు. వీటిని నగరంలో ట్రాఫిక్ నియంత్రణకు ఉపయోగించనున్నట్లు ఎస్పీ తెలిపారు.

కొత్త పీఆర్సీ ప్రకారం వేతనాలు

తిరుపతి అర్బన్: ఆర్టీసీలో పదోన్నతి పొందిన ఉద్యోగులకు కొత్త పీఆర్సీ ఇవ్వడానికి ప్రభుత్వం అంగీకారం తెలపడంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. జనవరి 1– 2020లో ఆర్టీసీ ప్రభుత్వంలో విలీనమైంది. అయితే అప్పటికే ప్రభుత్వ అనుమతి లేకుండా కార్పొరేషన్ రూల్స్ ప్రకారం రాష్ట్రంలో 2,096 మంది ఆర్టీసీ ఉద్యోగులకు పదోన్నతి కల్పించారు. వారిలో 131 మంది తిరుపతి జిల్లాకు చెందినవారు ఉన్నారు. పదోన్నతి ప్రకారం పీఆర్సీ ఇవ్వాలని ఉద్యోగులు కోరారు. విషయం సీఎం వైఎస్ జగన్ దృష్టికి వెళ్లడంతో ఆయన సమస్యను పరిష్కరించారు. దీనిపై ఉద్యోగులు సంతోషం వ్యక్తం చేశారు.

ఏడుగురు అంతర్రాష్ట్ర కాపర్ దొంగల అరెస్ట్


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ


పట్టుబడ్డ కాపర్

తడ: పరిశ్రమల నుంచి కాపర్ దొంగిలిస్తున్న ఏడుగురు అంతర్రాష్ట్ర దొంగల ముఠాని సూళ్లూరుపేట సీఐ వెంకటేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో తడ ఎస్ఐ జేపీ శ్రీనివాసరెడ్డి, సిబ్బంది పట్టుకున్నారు. దీనికి సంబంధించి నాయుడుపేట డీఎస్పీ రాజగోపాల్‌రెడ్డి తడ పోలీస్ స్టేషన్‌లో మంగళవారం విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేసి వివరాలు వెల్లడించారు. చెడు వ్యసనాలకు బానిసలైన 30 నుంచి 37 సంవత్సరాల వయసు కలిగిన చిత్తూరు టౌన్ పరిధిలోని తేనబండ రోడ్డుకి చెందిన అన్నదమ్ములు రామన్, లక్ష్మణన్, చిత్తూరు టౌన్ పరిధిలోని సంతపేటకు చెందిన ఆనందరాజ్, తమిళనాడు, వేలూరు సిటీకి చెందిన జగన్, చెన్నై సిటీలోని ఊరపాక్కంకి చెందిన చిత్తిరై సెల్వన్, రగుబాలన్, మాడంబాక్కంకి చెందిన విజయ్‌కుమార్ ఒక బృందంగా ఏర్పడి శ్రీసిటీలోని పరిశ్రమల్లో కాపర్ వైర్లు దొంగిలిస్తూ వస్తున్నారు. ఫిర్యాదు మేరకు పోలీస్ సిబ్బంది నిఘాపెట్టారు. అనుమానాస్పదంగా తమిళనాడు వైపు వెళుతున్న మారుతీ కారుని పరిశీలించారు. ఆ సమయంలో కారులో కాపర్ చుట్టలు కనిపించడంతో అందులోని వ్యక్తులను పట్టుకుని విచారించగా అసలు విషయం బయటపడింది. దొంగలను పట్టుకున్న సిబ్బందిని ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి అభినందించారు. దాడిలో పాల్గొన్న సీఐ, తడ ఎస్ఐ, సూళ్లూరుపేట ఎస్ఐ శేఖర్, సిబ్బంది సుబ్రమణ్యం, వెంకటేశ్వర్లు, అశోక్‌కుమార్, విజయ్‌కుమార్, చంద్రకు త్వరలో రివార్డులు అందించనున్నట్లు డీఎస్పీ తెలిపారు.

11 ప్రాంతాల్లో పాదరక్షల కౌంటర్లు

తిరుమల: తిరుమల శ్రీవారి దర్శనార్థం వచ్చే భక్తుల సౌకర్యవంతంగా పాదరక్షలు భద్రపరుచుకునేందుకు వీలుగా ఏప్రిల్ రెండో వారంలోపు 11 కౌంటర్లు సిద్ధం చేస్తామని టీటీడీ ఈఓ ఏవీ.ధర్మారెడ్డి తెలిపారు. తిరుమలలోని తమ కార్యాలయంలో మంగళవారం అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈఓ మాట్లాడుతూ చాలాకాలంగా అపరిష్కృతంగా ఉన్న ఈ సమస్యకు పరిష్కారం చూపుతూ కౌంటర్ల ఏర్పాటుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ప్రధాన కళ్యాణకట్ట ప్రవేశ మార్గం, అన్నదానం కాంప్లెక్స్ ప్రవేశ మార్గం, టీబీసీ బ్రిడ్జి నారాయణగిరి షెడ్ల మధ్య ఉన్న ప్రాంతం, నారాయణగిరి షెడ్ల ప్రవేశ మార్గం, వైకుంఠం క్యూ కాంప్లెక్స్–2 ఎదురుగా, ఏటీసీ సర్కిల్ వద్ద, వైభవోత్సవ మండపం వద్ద, సుపథం వద్ద, కళ్యాణకట్ట నుంచి బేడిఆంజనేయ స్వామి ఆలయం మధ్య ఉన్న ఆర్చి వద్ద, పీఏసీలు, శ్రీవారి సేవాసదన్–1, 2 వద్ద ఈ కౌంటర్లు ఏర్పాటు చేస్తామన్నారు. కౌంటర్లు తాత్కాలికంగా వీజీఓ ఆధ్వర్యంలో పనిచేస్తాయని, ఇందుకు తగ్గ ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. కౌంటర్ల వద్ద అవసరమైన ఎల్ఈడీ లైటింగ్, బ్రాడ్ కాస్టింగ్ వ్యవస్థను ఏర్పాటు చేయాలని సూచించారు. కౌంటర్లలో పాదరక్షలు భద్రపరుచుకునేందుకు వినియోగించే సంచులను కొనుగోలు చేయాలని మార్కెటింగ్ విభాగం అధికారులను కోరారు. సమావేశంలో ఎస్ఈ–2 జగదీశ్వర్‌రెడ్డి, వీజీఓ బాలిరెడ్డి, డీఈ ఎలక్ట్రికల్స్ రవిశంకర్‌రెడ్డి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ శ్రీదేవి, డెప్యూటీ ఈఓలు భాస్కర్, హరీంద్రనాథ్, క్యాటరింగ్ ప్రత్యేక అధికారి శాస్త్రి పాల్గొన్నారు.

శ్రీరామాలో జాతీయ సైన్స్ దినోత్సవం


ఐఐఎస్ఈఆర్ డైరెక్టర్ ప్రొఫెసర్ గణేష్‌ను సత్కరిస్తున్న శ్రీరామ ఇంజినీరింగ్ కళాశాల చైర్మన్ మన్నెం రామిరెడ్డి

తిరుపతి ఎడ్యుకేషన్ : తిరుపతి–కరకంబాడి రోడ్డులోని శ్రీరామ ఇంజినీరింగ్ కళాశాలలో మంగళవారం జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాస రచన, వక్తృత్వ, క్విజ్ వంటి పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ముఖ్య అతిథిగా ఐఐఎస్ఈఆర్ డైరెక్టర్ ప్రొఫెసర్ కెఎన్.గణేష్ హాజరై రామన్ ఎఫెక్ట్ కనుగొన్న రోజునే జాతీయ సైన్స్ దినోత్సవంగా జరుపుకుంటున్నట్లు తెలిపారు. అలాగే ఫిబ్రవరి 28 ప్రముఖ శాస్త్రవేత్త ఐన్‌స్టీన్ జన్మదినమని చెప్పారు. మన జీవన విధానం సైన్స్‌తో ముడిపడి ఉందని, విద్యార్థులు నిరంతరం అన్వేషణ చేస్తుండాలని పిలుపునిచ్చారు. అనంతరం ప్రొఫెసర్ ఆ కళాశాల చైర్మన్ మన్నెం రామిరెడ్డి సత్కరించారు. కళాశాల డైరెక్టర్లు మన్నెం రామసుబ్బారెడ్డి, మన్నెం అరవిందకుమార్‌రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ కె.జయచంద్ర విద్యార్థులు పాల్గొన్నారు.

ముగిసిన అవగాహన సదస్సు

తిరుపతి అర్బన్: నగరంలోని కరకంబాడి రోడ్డు మార్గంలో ఓ హోటల్‌లో భారత ప్రభుత్వ ఎంఎస్ఎంఈ డెవలప్‌మెంట్ అండ్ ఫెసిలిటేషన్ కార్యాలయం విశాఖపట్టణం వారి ఆధ్వర్యంలో చేపట్టిన పారిశ్రామిక వేత్తల రెండు రోజుల అవగాహన సదస్సు మంగళవారంతో ముగిసింది. సదస్సులో సూక్ష్మ, చిన్న మధ్యతరహా పరిశ్రమలకు సంబంధించిన స్థాపన, రాయితీలపై వివరించారు. జీవీఆర్ నాయుడు, ప్రతాప్‌రెడ్డి, వరదరాజన్, రవిశంకర్, ప్రసాద, రామాంజనేయులు, విజయభాస్కర్ పాల్గొన్నారు.